

శతకాలు


భక్తి,జ్ఞాన,నీతి

అప్పనపల్లి బాలాజీ చతుస్సతి








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100028418


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

అప్పనపల్లి శ్రీబాలాజీచరిత్రము



కృతికర్త

మొండా చిన సీతారామయ్య ఎమ్.ఏ.

ఆంధ్రోపన్యాసకుఁడు (రిటైర్డు)

ధవళేశ్వరము.


శ్రీరస్తు

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

ఓం నమో వాసుదేవాయ   ఓం నమో నారాయణాయ

ఓం నమో వేంకటేశాయ   ఓం నమో బాలబాలాజి దేవాయ

అప్పనపల్లి



శ్రీకరంబులు సంసార సింధుతార
కములు సంతోష సంవర్ధకములు వృజిన
విపిన వీతిహోత్రములు శ్రీవేంకటేశ
చరణ రాజీవములు మాకు శరణ మగుత.

THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF TIRUMALA TIRUPATI DEVASTHANAMS UNDER THEIR SCHEME "AID TO PUBLISH RELIGIOUS BOOKS"

కృతికర్త

మొండా చిన సీతారామయ్య ఎం.ఏ.

ఆంధ్రోపన్యాసకుడు (రిటైర్డు)
ధవళేశ్వరము.

ఇష్టదేవతాస్తుతి

శ్రీరాధావనజేక్షణా కుచయుగ శ్రీగంధ సంవాసిత
స్ఫారోరస్స్థల కౌస్తుభుండు, మురళీ సంగీత సమ్మోహితా
భీరై ణీనయనా విలాస నటనాపేక్షాంతరంగుండు, బృం
దారామాంతరకేళిలోలుఁడు యశోదాపత్యు మోహమున్ మమున్ 1

సామజదైత్యసూదనుఁడు, శైలవిభేదన ముఖ్యదేవతా
స్తోమకిరీటరత్నరుచిశోభిత దివ్యపదాంబుజుండు, దు
ర్గామహిళామనోహరుఁడు, రౌప్యగిరీంద్రవిహారుఁ డార్తలో
కామరభూరుహుండు శివుఁ డాద్యుఁడు మమ్ముల నేలు నిచ్చలున్. 2

సురమునిసంఘముల్ గొలువ శుభ్ర కుశేశయ పీఠిపై నిరం
తరము వసించి పల్కుఁజెలి నవ్వులపువ్వులఁ జొక్కునట్టి యా
సరసిజ నాభసూతి ననిశంబును మాకుఁ జిరాయురున్నతుల్
కరుణ నొసంగ వేఁడెదను గ్రమకవిత్వవచస్సుమాంజలిన్. 3

దురితధ్వాంతముఁ బాపఁ దిగ్మరుచిగా దుఃఖాద్రిసందోహమున్
హరియింపన్ గులిశమ్ముగాఁ బ్రబల విఘ్నానోకహానీకమున్
బెఱుకన్ జండమరుత్తుగాఁ బరఁగు స్తంబేరాస్య హేరంబునిన్
స్థిరభక్తిన్ భజియింతు నేను ధిషణాదివ్యత్కవిత్వాప్తికై. 4

నిర్ఝర స్రోతస్వినీ వీచికా డోలి
కా మాలికా చలత్కోమల నవ
కల్హార సాంద్రసుగంధ సంగ్రహణ స
మాగత సమద బంభర నితాంత
ఝుంకార విభ్రాంత ఝషకేతనాధూత
శింజినీ వల్లి విచిత్రరావ
విహ్వల యౌవత విభ్రమ విహరణ
ప్రాసాద చంద్ర శాలా ప్రతిష్ఠి
త క్షపేశదృషత్స్థల స్థగితమౌక్తి
కాతతచ్ఛవు లొలయు సాకేతమందు

నాలఁగు జానకీజాని మామక దురంత
పాపభుజగసుపర్ణుఁడై వఱలుఁగాక. 5

నీరధి లంఘనావగత నిర్భరరంహుని రామపాద నీ
రేగహ మాకరంద లహరీ పరితోషిత చిత్తభృంగునిన్
హీరసముజ్జ్వలాంగుని వనేచరనాథునిఁ బింగళాక్షునిన్
మేరుసమానధీరుని సమీరకుమారునిఁ గొల్తు భక్తిమై 6

క్షీరపయోధిపుత్రియయి శిష్టవరప్రద కామధేనువై
వారిజనేత్రు పేరురముపై నెడఁబాయక పొల్చియుండు ల
క్ష్మీరమణీలలామ నిజశీతలపేశల సద్ఘృణాసుధా
సారములన్ మముం దనిపి శాశ్వతభోగము లిచ్చి కాపుతన్. 7

ఓ జగదేకమాత! వికచోత్పల పత్రవిశాల నేత్ర! ని
ర్వ్యాజ కృపాసముద్ర! నిగమాంత హిరణ్మయ కుండలప్రభా
రాజిత సత్సభాంతర! చిరంతన మౌనిజనాస్యదర్పణ
భ్రాజిత దివ్యరూప! నినుఁ బాయనిభక్తి భజింతు భారతీ! 8

విమల కృష్ణానదీ వీచికా గత సమీ
  రంబులు వింజామరములు వీవ
మల్లీశ్వరస్వామిమస్తకాలంకృత
  బాలేందురోచి నివ్వాళు లిడఁగ
ఇంద్రకీలాహార్య సాంద్రవృక్షచ్ఛాయ
  భవ్యాతపత్రమై పరిఢవిల్ల
వందారు సద్భక్తబృందాంతరంగముల్
  పూజా సుమంబులై పొలుపు మిగుల
విజయవాటికా సౌవర్ణ పీఠిమీఁద
నయినపర్వంబుగా దర్శనం బొసంగు
కనకదుర్గా! విదారిత కలుషవర్గ!
ఏటి కోళ్ళందు కొనుచు మమ్మేలు తల్లి 9

స్తోత్రలహరి

శ్రీ కైవల్యపదప్రద!
నాకధునీజననపాద! నందక ధారీ!
సాకార! నిరాకార! భ
వాకూపార కలశీజ! ఆగమరూపా! 1

తిరుపతి వేంకటరమణా!
దరహాసముఖారవింద! ధరణీ దయితా!
నిరుపమ కారుణ్యగుణో
త్తర! త్రిగుణాత్మక! దశావతారవిరాజీ!

లీలామానుష విగ్రహ!
ప్రాలేయమయూఖమౌళి వందితనామా!
త్రైలోక్యాభయదాయక!
క్షాళితశరణార్థిదురిత కర్దమనిచయా! 3

నీరద శక్రనీలరమణీయ తనూవిభవమ్ముతోడ, వి
స్ఫార విలోచనాబ్జవిలసత్కరుణా మధువృష్టితోడఁ జాం
ద్రీరుచిరాభసుందర వినిర్మల హాసముతోడ, భక్తమం
దార! ముకుంద! నీ మధుర దర్శన భాగ్య మొసంగ వేఁడెదన్ 4

నీవె మదీయమానసవనీ రుచిమన్మథుమూర్తివంచు, సం
భావన చేసి, మోహకరమంగళరూప! త్వదీయపాదసే
వా వినిబద్ధబుద్ధి ననవద్యసుఖప్రదముక్తిభద్ర దం
తావళ కుంభపీఠి సముదాత్తగతిన్ జరియింప నెంచెదన్. 5

మోహనవంశనాళరవమున్ విని నంతనె సృష్టియెల్ల, ను
త్సాహసమగ్రతన్ బరవశంబగు నందు, రదోక్కమాటు, శే
షాహిశయాన! నా చెవుల హాయిగ నింపుము, స్వర్గసౌఖ్య సం
దోహమ్ముఁ గోరబోను బరితోషముతోఁ బులకింతు నీ యెడిన్. 6

నీ రమ్యాలోక జ్యో
త్స్నారోచులు నిండినట్టి నామది పారా
వారమ్మై యుప్పొంగదె?
పారాశర్యాది సుకవి వర్ణిత చరితా! 7

పదునాఱేఁడుల ప్రాయమందుఁ గవితా ప్రావీణ్యముం జూపి, శా
రదఁ గైసేసితి 'తేనెవాఁక"లను పేరన్ ఖండకావ్యపదన్
ముదమొప్పారఁగ "సుప్రభాత" సుమనఃపుంజంబు నీకిచ్చితిన్
మది నిన్గాంచు నదృష్టమీయఁగదె శ్రీమద్వేంకటాద్రిప్రభూ! 8

ఒప్పులో తప్పులో యెఱుఁగ నొజ్జల పజ్జను నేర్చినట్టి మేల్
కప్పురతావి పోఁడుములు గల్గు తెలుంగుఁగవిత్వపుంజవుల్
చొప్పడ నిన్ను నారతము స్తోత్రము సేసెద, కావ రాఁగదే
అప్పనపల్లి దేవర! కృపామృతసాగర! వేంకటేశ్వరా! 9

భక్తితోఁ జతుశ్శతిని నీపై రచించి
ప్రీతి నీకుఁ గాన్కగ సమర్పించుకొంటి
భక్తరోలంబనికురుంబ పారిజాత!
వేంకటేశ్వర! నన్ను దీవింపుమయ్య! 10

అనుక్రమణిక

1 శ్రీ స్వామి సంకీర్తనము

శ్రీసతీలోచనోత్పల భాసమాన
పూర్ణిమాహిమధామ! అంభోజనాభ!
శ్రితజనావనదీక్షాధురీణహృదయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 1

ఆదిమధ్యాంతరహిత! ప్రహ్లాద నార
దాది సద్భక్తజనసేవితాంఘ్రియుగళ!
విహగపరివృఢవాహన! వేదవేద్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 2

మాన్యమునిగణ జేగీయ మాన చరిత!
సకల లోకపాల! మనోజ్ఞ శక్రనీల
శతసహస్ర రోచిర్నిభ శ్యామలాంగ!
బాల బాలాజి! అప్పనపల్లి దేవ! 3

దైత్యసందోహకాంతారదావదహన!
దురితసంతమసచ్ఛటాద్యుమణితేజ!
పీతకౌశేయ పరిధాన! విశ్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 4

మఘవముఖ్యనిర్జరనమ్రమౌళిరత్న
కాంతినీరాజితచరణకంజయుగ్మ!
పన్నగాధీశపర్యంక! పరమపురుష!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 5

ప్రణవకాసారసంచారరాజహంస!
వివిధబాధాళిలోచ్ఛయభిదురపాణి!
భాగవతచాతకవిసీలవార్షుకాభ్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 6

శంఖ చక్ర గదా శార్ఙ్గ సహితహస్త!
సురధునీజన్మకారణసుభగపాద!
జానుపర్యంతలంబితస్వర్ణహార!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 7

సత్పురుషశుకానీకరసాలసాల!
చికురపిహితవిశాలసుస్నిగ్ధఫాల!
అప్రమేయవిశిష్టగుణాలవాల!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 8

శ్రీనివాస! పద్మావతీప్రేమపారి
జాతసౌరభ్యసంసక్తచంచరీక!
సచ్చిదానందసద్గుణసౌమ్యమూర్తి!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 9

యదుకులాంబుధిచంద్ర! మాయాప్రకల్పి
తాఖిలజగత్సమూహ! వేదాంతకనక
పంజరస్ఫురచ్ఛారిక! పాండురంగ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 10

సుజనహిత! జగన్నాటక సూత్రధారి!
సర్వలోకైకదేశికసార్వభౌమ!
పూర్వగీర్వాణదుర్వారగర్వహరణ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 11

నవ్యనవనీతచోర! బృందావనీ వి
హార! శతకోటిమన్మథాకార! రుక్మి
ణీ రుచిరదరహాసచాంద్రీచకోర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 12

దేవకీప్రియాత్మజ! వసుదేవనయన
తామరసనభోమణి! యశోదా ముదబ్ధి
పర్వ చంద్రమ! నందగోపాలబాల!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 13

అమృతరూప! హృషీకేశ! యజ్ఞపురుష!
విష్టరశ్రవ! వైకుంఠ! వృష్ణితిలక!
అచ్యుత! వృషాకపి! ఉపేంద్ర! అద్వితీయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 14

బర్హి బర్హావతంస! దాశార్హ! రమ్య
కౌస్తుభవిరాజమాన వక్షఃప్రదేశ!
సప్తభూభృన్నివాస! ప్రసన్నహాస!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 15

ఏకశృంగ! విష్వక్సేన! వృష! విరించి!
విష్ణుదేవ! సాత్వత! శిపివిష్ట! కపిల!
పృశ్నిగర్భ! అధోక్షజ! విశ్రుతాత్మ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 16

వామదేవప్రియంకర! సోమసూర్య
లోచనద్వయ! నిర్జర నైచికీ ప
యోభిషేకస్ఫురన్నిత్యయౌవనాఢ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 17

రాధికా వరవర్ణినీ ప్రణయచూత
పల్లవాస్వాదనోన్మత్త పరభృతంబ!
రాసలీలావినోదసంపత్ప్రవణహృదయ!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 18

ముంజకేశ! త్రివిక్రమ! ముక్త సంగ!
చక్రపాణి! చతుర్భుజ! జలజనాభ!
కైటభారి! నారాయణ! కనకవసన!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 19

నిర్మల జ్ఞానదీపకాంతిచ్ఛటా వి
దారితభవాంధకార! పంకేరుహాస
నాదిదైవదురాపదివ్యస్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 20

ఫల్గునశతాంగచోదక! ప్రత్యగాత్మ!
చైద్య మస్తకచ్ఛేదక! సత్యదేవ!
మహితముచికుందమోక్షద! మంజుభాష!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 21

చతురశృంగారసాగర! శాంతరూప!
సురుచిర మసార సన్నిభ శోభనాంగ!
అభయ ముద్రాంచిత వర కరాంబుజాత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 22

సనకముఖ్యయోగీశ్వరవినుతచరిత!
మారుతాత్మజపూజితచారుచరణ!
కార్తవీర్యబాహు సహస్ర గర్వ హారి!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 23

సింధుకన్యామనోహర! శేషభోగ
మణివిరాజితమేచక మంజులాంగ!
నవ్యమౌక్తికాలంకృతనాసికాగ్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 24

గర్భదారిద్ర్యవిధ్వంసకప్రసిద్ధ
నామ! సంస్తుత్యసద్గుణోద్దామ! సవితృ
వంశ కలశాబ్ధి సోమ! విపద్విరామ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 25

అసితకువలయసమధికమసృణదేహ!
మిత్రవిందా మనఃప్రియ! ఛత్రితాహి,
హంసడిభక దుర్జయ తుహినాంశుమాలి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 26

దేవకీగర్భశుక్తిమౌక్తికఫలంబ!
సత్యభామా మనోవనీ నిత్యచైత్ర,
త్రిజగదాహ్లాదకారకదివ్యరూప!
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 27

నిర్వికార! నిరంజన, నిర్వికల్ప!
నిరుపమాన! నిరామయ! నిర్విశేష!
నిష్కళంక! నిరాకార! నిర్నిరోధ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 28

క్షీరసాగరశయన, లక్ష్మీ కుచాగ్ర
మృగమదామోదపులకితమేచకాంగ!
భవ్యనిశ్శ్రేయసప్రదపాదపద్మ,
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 29

నందనందన, గోవింద, నాదలోల!
కేశవ! వనమాలి, హరి, శ్రీకృష్ణ, శౌరి,
కంబుకంధర! కమలాక్ష! కంసవైరి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 30

మాధవా! మధుసూదన! మదనజనక!
వరకృపావరుణాలయ! వాసుదేవ!
వడ్డికాసులసామి! శ్రీవత్సచిహ్న!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 31

నిత్యసంతోషదాయక! శ్రుత్యతీత
భవ్యకాంతివిద్యోతితదివ్యదేహ!
నిజముఖోద్గీతగీతాధునీప్రవాహ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 32

అంబురుహపత్రనేత్ర! సంయమివరేణ్య
మానసారామచైత్ర! రమాకళత్ర!
దురితవల్లీలవిత్ర! సాధుజనమిత్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 33

ఉపనిషద్వనకేళీమయూర! కాళి
యాహిభోగాగ్రవిస్ఫురితాంఘ్రియుగళ!
పద్మజాతాండభాండసంభరితగర్భ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 34

సర్వతోముఖ! భక్తవత్సల! పురాణ
పురుష! కుత్కీలధారి! మధ్వరి! సహస్ర
శీర్ష! దామోదర! ముకుంద! సింధుసదన!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 35

రామ! రఘురామ! జగదభిరామ! దనుజ
రాజదుర్వారగర్వవిరామ! భవ మ
హాబ్ధి తారకనామ! భద్రాద్రిధామ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 36

శ్రుతిశిఖావతంసపవిత్రసుందరాంఘ్రి
పల్లవద్వయ! ప్రణవరూపప్రభావి
తాఖిలాండకోటి ద్రుహిణాండనిచయ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 37

కనకమయచేల! ముకురసంకాశరమ్య
భాసురకపోల! గాయకభక్తగాన
లోల! కాయకాంతిజితేంద్రనీలజాల!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 38

శ్యామసుందర! భువనరక్షైకదక్ష!
చిద్గగనవిస్ఫురద్రమ్యశీతరోచి!
నామగుణరూపరహిత! సన్మాన్యచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 39

నిగమనిగదితనిరుపమసుగుణపుంజ!
అష్టకులసతీరుచిరవక్త్రాబ్జమిహిర!
విష్టపత్రయరక్షావిశిష్టహస్త!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 40

నిఖిలదిగధీశ బృంద వందిత పదాబ్జ !
శుకమునీంద్రవచోవార్ధిశుభ్రకిరణ!
వాఙ్మనోనేత్రదుర్లభభాగ్యరాశి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 41

జలజభవ శార్ఙ్గి శర్వతేజఃప్రభాస!
ముగ్ధమోహనసౌందర్యముదితభువన!
సాధుసారంగయూధవర్షాపయోద!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 42

జయ భుజంగాహితధ్వజ। జయ రమేశ!
జయ సునాసీరసేవిత! జయ మురారి!
జయ కపర్దికార్ముకభంగ! జయ శుభాంగ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 43

శ్రౌతమాకందశాఖాచరత్పికేంద్ర!
ఘోషయోషిజ్జనాపరకుసుమబాణ!
శుక్లపక్షచంద్రాలోకశుభ్రహాస!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 44

2 అప్పనపల్లి క్షేత్ర వైభవము

రమ్యమైె కుంభపురిపై విరక్తిఁ జెంది
కోనసీమ నప్పనపల్లి కోవెలకును
పద్మతోడ వచ్చిన నీకు స్వాగతంబు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 45

ఉత్తరదిశాభిముఖముగాఁ జిత్త మలరఁ
బాఱు వైనతేయాపగాతీరభూమి
ఖ్యాతిఁ గాంచిన శ్రితలోకకల్పశాఖి!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 46

నయనపర్వముఁ గూర్చెడి నారికేళ
వృక్షసంతతి నడుమ సంప్రీతిఁ గొలుపు
దేవళంబున నెలకొన్న దివ్యమూర్తి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 47

మిసిమి తొలుకారుమబ్బుల మేలమాడు
నీలదేహముతోడ మా మ్రోల నిలిచి
కనుల విందొనగూర్పుము కాంక్ష తీఱ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 48

ధర్మసంస్థాపనార్థమై ధరణిఁ బుట్టి
దుష్టనివహంబుఁ గూల్చి సాధులను గాచి
భక్తరక్షకబిరుదానఁ బరఁగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 49

సూరిజనులకుఁ గొంగుబంగార మగుచు
దీనజనులకు దేవతాధేను వగుచు
ముదముతో దర్శనం బిచ్చు సదమలాంగ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 50

సౌరభంబులు చిమ్ము పటీరజలము
నాలయపు వాకిటను గలయంపిఁ జల్లి
మేలి ముగ్గులు వెట్టిరి మెలఁత లెలమి,
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 51

కర్ణపేయమై గుడిని జేగంట మ్రోఁగఁ
గనుల నానందబాష్పశీకరము లొల్క
జనులు నినుఁ జూచు వేడుక సాగినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 52

ప్రాతరాదిత్యకిరణవారమ్ము సోఁకి
పులకరించిన క్రొందమ్మిపూలు దెచ్చి
దాసు లర్చింప నిన్ను విచ్చేసినారు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 53

వేదకోవిదగ్రామణుల్ విప్రవరులు
వారిదగభీరకంఠరావముల నిన్ను
మస్తకన్యస్తహస్తులై ప్రస్తుతింత్రు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 54

అభము శుభము నెఱుఁగని యప్పన్న నాఁడు
తపము చేసిన యట్టి యీ స్థలము నేఁడు
రహిని నీ యునికిచేఁ దీర్థరాజమయ్యెఁ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 55

"దేవదూత" రామస్వామి దీక్షఁ బూని
ఏడుకొండలవాని సర్వేశు నిన్ను
'బాల బాలాజి" గా నిటుఁ బాదుకొలిపె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 56

అగ్నిదగ్ధమై పూరిల్లు హూరువు మీఱి
దివ్య దేవాలయంబుగాఁ దేజరిలఁగ
హేతుభూతుఁడ వీ వని యెంతు మేము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 57

కోవెలకు ధ్వజస్తంభంబు కొఱకు, వఱద
లోన టేకుమ్రాను తనంతఁ దానె యేఁగు
దెంచు టున్న నీ మహిమ గాఁ దెల్ల మయ్యెఁ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 58

నాఁడు చెఱసాలలోఁబుట్టి నావు; నేఁడు
వేడ్కఁ గొబ్బెరరాశిలో వెలసినావు;
నీదు లీలలు మాకు వర్ణింపఁ దరమె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 59

నిత్య యాత్రాస్థలంబుగా, నిఖిలభక్త
కామితార్థప్రదాయిగాఁ గడుఁ బ్రసిద్ధిఁ
గాంచె నప్పనపల్లి నీ కారణముగ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 60

మల్లికా కుంద మందార మాలతీ ల
తాంత మాలికల్ నీ కంఠ మం దలంక
రింపఁ జేరినారు జనులు శ్రేణులుగను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 61

జాతికులమతభావంపు శంక లేక
యెల్లవారలు సహపంక్తి నుల్ల ములర
భోజనము సేయుట గుడి నబ్బురము గాదె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 62

శేషపర్యంకశాయి లక్ష్మీధవుండు
పార్థసారథి పుట్టలోఁ బాలు త్రావు
శ్రీనివాసుఁడు కోవెలఁ గానిపింత్రు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 63

మయునిఁ దలదన్ను శిల్పులు నయము మీఱ
దివ్యనిస్తులవాస్తు దీధితులు నింపి
తిరుమలకు దీటుగా గుడిఁ దీర్చినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 64

విమలగోదావరీతరంగముల మీఁది
కొదమతెమ్మెరల్ వేఁబోక ముదముతోడ
వీచి వీచోపులై నీకుఁ బ్రీతినెఱపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 65

అప్సరోవధూవ్రాతంబు నపహసించు
నాటువెలఁదులు చతురలాస్యము లొనర్పఁ
గలిమిదేవేరి కిన్నెఁగంటు నలరు స్వామి
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 66

ఫణసహస్రంబు ఛత్రమై పరిఢవిల్ల
భుజగనాథుఁ డనంతుఁడు నిజతనూ వి
లాస మెసఁగ, నిన్గొలువ వచ్చేసినాఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 67

పక్షవిక్షేప సంజాత పవనవేగ
ఘూర్ణితాంభోధి ఖగరాజు కుతుక మొప్ప
నీ విహారవాహన మౌచు నిలిచినాఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 68

స్వర్ణశైలాభదేహుండు, స్వామికార్య
తత్పరుఁడు హనుమంతుఁడు ద్వారపాల
వృత్తిఁ జేపట్టి నీగుడి నిచ్చ గించె;
బాల బాలాజి! అప్పనపల్లిదేవ! 69

కలుషహారిణి యాకాశగంగ నీదు
చారుచరణకంజాతసంజాత యగుచు
విష్ణుపది యన్న తనపేరు విశదపఱిచె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 70

కామగవిపాలతోడ నుత్రాము (డెలమి
నమృతమాధుర్యతుల్యపాయసము (దెచ్చి
ముచ్చటుగ నీకు నైవేద్య మిచ్చి మురియు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 71

సరస సంగీత రసధునీ ఝురులు పొంగ
నారదుఁడు తుంబురుఁడు నీదు చారుచరితఁ
బాడుచుందురు దృఢభక్తి భరితు లగుచు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 72

సుర గరుడ నాగ యక్ష కింపురుష సిద్ధ
సాధ్య కిన్నర ముఖ్య ఖేచర గణంబు
నమ్రశీర్షు లై నీకు వందన మొనర్తు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 73

బ్రహ్మరుద్రు లింద్రాదిదిక్పతులు పరమ
భాగవతులు, మహర్షులు భక్తి నిన్ను
సౌఖశాయనికు లగుచు సంస్తుతింత్రు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 74

కలికిచూపులకలువదండల నొసంగి
యలఁతినవ్వుల నివ్వాళు లెలమి నిచ్చి
సిరియుఁ బుడమియు నిన్నుఁ గోరి చేరినారు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 75

నందనోద్యానసీమలో నందమైన
యలరులను గోసితెచ్చి మాల్యములు గ్రుచ్చి
వేల్పుటిల్లాం(డ్రు నీ కీయ వేచినారు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 76

వైనతేయనిమ్నగ విరజానదీమ
తల్లిగాఁ, జిన్ని యప్పనపల్లి భాస
మాన వైకుంఠపురిగ మా మదిని దోఁచు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 77

పచ్చవిలుకానితల్లికిఁ బంటువలఁతి
కొక్కరూపునఁ బొలయల్కఁ జక్కదిద్దు
చతురరసికునిగా నిన్ను స్తుతులొనర్తు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 78

తమ్మిచూలికి శూలికి నెమ్మనమున
సమ్మదముఁ గూర్చు భవదీయచారుమూర్తి
వీక్షణోత్సవ మెప్డుఁ జూపింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 79

3 ఆత్మనివేదనము

చూపులు చకోరకంబులై చుట్టుముట్టి
యుష్మదీయాస్యచంద్రదీపీయూషపాన
పారవశ్యాన నిరతంబుఁ బర్వులెత్తు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 80

హృదయభావసుమంబుల నేర్చికూర్చి
యుపదగా నీకు నర్పింప నుత్సహింతు;
దీను నను గావు మో సామగానలోల!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 81

ఇంద్రతుల్యవై భవముపై నిచ్ఛలేదు
త్రిదివసుందరీరమమాణదృష్టిలేదు
భక్తి నిన్ను సేవింప నాసక్తిగలదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 82

ఆపదలు శ్వాపదములై భయానకముగ
మీఁద లంఘించు దుర్వేళ నాదుకొనఁగ
నభయహస్త మందించు రథాంగపాణి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 83

ముంచుకొనివచ్చు దుఃఖసముద్రభంగ
సంఘములఁజిక్కి తరియింప శక్తిలేక
నిన్నె పెనునౌకగా మది నిలుపుకొంటి;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 84

జననమరణమ్ము లీ కాలచక్రమందుఁ
జాలగాఁ బొంది విసిగి వేసారినాఁడ
వేగ నినుఁజేరు త్రోవఁ జూపింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 85

చీఁకటిని జూచి భీతిల్లు చిన్నిబిడ్డ
నెదకుఁజేర్చెడి తండ్రిగానెంచి నిన్నుఁ
బ్రీతిఁ గొల్చెడి నాకుఁ జేయూఁతనిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 86

బ్రతుకుఁ దార్థియపురుషార్థపరముఁజేసి
జీవితచరమాంకమున నిన్ జేరినాఁడ
వ్యసనపరతంత్రు మన్నింపుమయ్య నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 87

జ్ఞానలవదుర్విదగ్ధత సాధుజనులఁ
బ్రల్లదములాడి పాపకూపమునఁబడితి
పతితపావన! నన్నుఁ గాపాడుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 88

ఊహ లుప్పొంగు రత్నాకరోర్మిమాల
లౌచు డెందంబు నైశ్చల్యమందకుండ
క్షోభఁబెట్టును; శాంతిఁ జేకూర్పు నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 89

కనులఁగూరుకురాదు నెమ్మనము సతము
ప్రాణభీతిని నూయెలపగిది నూఁగు
నెటులఁ గరుణించి ప్రోతువో యింక నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 90

ఎట్టి క్లేశములైన నిన్నెంచఁగానె
వెలుతురును జూచి చీఁకటి తొలఁగురీతిఁ
బంచబంగాళమై వేగఁ బరుగుదీయు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 91

ఆలుబిడ్డలు చుట్టము లాత్మసఖులు
భోగభాగ్యతతులు నీటిబుడగలంచుఁ
దెలిసికొని నిన్ను నమ్మితి దృఢముగాను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 92

నిబిడదారిద్ర్యకల్లోలినీప్రవాహ
మందు మున్గి తేలెడి నిస్సహాయునన్నుఁ
గనికరంబున దరిఁజేర్చి కావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 93

దారసంతానపోషణభారవశత
నలసిపోయితి సంసారజలధినీఁదఁ
జేతులెత్తి మ్రొక్కెదఁ గటాక్షింపునన్ను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 94

ఎదురుదెబ్బలుతప్ప నా బ్రదుకులోన
నీసమెత్తుసౌఖ్య మనుభవింపనైతి
నుడుకుఁగన్నీరుఁ దుడువరావోయి వరద!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 95

త్రాఁచు పూత్కారములకు సంత్రాసమందు
కప్పరీతి మృత్యువుపేరు చెప్ప గానె
యడలిపోయెడి నా కభయమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 96

నియమబద్ధత నిన్ను ధ్యానింపలేను
స్పష్టముగ నీదు కీర్తనల్ పాడలేను
కృప దలిర్పఁగా నన్నువీక్షింపు మభవ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 97

వేదశాస్త్రవైదుష్య మబ్బినదిలేదు
విదిత తీర్థ దర్శనము చుక్కెదురు నాకు
హృదిని నమ్మితి నీవె నా కేడుగడగ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 98

ఆశ లను కందిరీఁగ లీ యంతరంగ
కోటరముఁజొచ్చి నిరతమారాటుపెట్ట
శ్రమముఁబొందెడినాకు స్వాస్థ్యమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 99

నామరూపరహితు నిన్ను నేమ మొప్పఁ
దలఁచి తరియింప నా కసాధ్యంబుగాదె?
అర్తునకు నాకు నీవె కొండంత యండ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 100

తీవ్రరోగార్తిచేఁ గడు దిగులుఁజెంది
కన్నులనె ప్రాణముల్ నిల్పుకొన్నయట్టి
ప్రజకు సర్వథా నీవె శ్రీరామరక్ష
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 101

నీటి యెద్దడిఁజూచి కన్నీరుగార్చి
పైరుఁగావంగ నిను రైతు కోరినపుడు
వృష్టిఁ గురియించి సస్యసమృద్ధి నీవె
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 102

దుఃఖమేఘాంచలంబునఁ దొంగిచూచు
మోదసౌదామినీరేఖ మోహపఱుప
బ్రతుకు బాధలు మఱతురు ప్రజ లదేమొ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 103

తారకబ్రహ్మమంత్రతత్త్వజ్ఞుఁ డంజ
నా సుతుఁడుతప్ప భవదీయనామమహిమ
నెఱుఁగ నెవ్వారు దక్షు లీ పృథివిలోన
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 104

శుద్ధచైతన్యమూర్తిగా సూరిజనులు
నిన్నుఁ బేర్కొందు రదియేమొ నిశ్చయించి
తెలిసికొనెడి శక్తినిఁ బ్రసాదింపు నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 105

అగణితంబులగు మతము లవతరించి
నిన్ను వాకొన్నతీరు సంతృప్తి నిడదు;
సగుణుఁడవొ నిర్గుణుఁడవొ విస్పష్టపఱుపు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 106

ఆజవంజవపాథోధియందు మున్గి
కొట్టుమిట్టాడు నన్నుఁ జీకొట్టకుండఁ
దావకకటాక్ష నౌకతోఁ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 107

చల్లఁజేయుఁ జొక్కపువెన్న సంభవించు
రీతి నిష్ఠతో నినుఁగొల్వఁ జేతమందుఁ
గానవత్తువు సత్స్వరూపాన నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 108

వాఙ్మనోనేత్రములకుఁ దావకనిసర్గ
తత్త్వ మెఱుగంగ శక్యమే? తామసుఁడను
నాకు నీ దర్శనంబుఁ గన్పొర నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 109

నీదుపాదాబ్జసంసేవ నీదుభక్త
కోటితోడి సాంగత్యంబు సాటిలేని
భూతదయను నా కొసఁగు సంప్రీతితోడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 110

అరణిలో నగ్ని గూఢమై పరగురీతి
నీవు మాలో నిగూఢమై నిండియుండఁ
గానసట్టి యజ్ఞుల మమ్ముఁగావుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 111

నీ విరాడ్రూప మెంచివర్ణింప ముక్త
సంగులైనట్టి పరమహంసలకునైన
శక్యమే? వృజినారణ్యజాతవేద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 112

పూర్వభవమునఁ జేసినపుణ్యమేమొ
తావకపదాబ్జశుశ్రూష దక్కెనాకు
జన్మరాహిత్య మొసఁగి నన్ సాఁకుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 113

నీకు సాటిదైవంబు ముల్లోకములను
వెదకి చూడఁగ లేఁడని విజ్ఞులనఁగ
నమ్మి నీపజ్జ నేఁ జేరినాఁడ తండ్రి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 114

వలపుటూబిని దిగజారి కలఁతఁజెందు
చిత్తమత్తేభమును గృపాసింధు వగుచు
నాదుకొనుమయ్య కోటితిగ్మాంశుతేజ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 115

నీవు ప్రత్యక్షమై కోరుకో వర మన
నేమికోరఁగవలయునో యెఱుఁగనేను;
అన్నిటికి నీవె దిక్కని యాత్మఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 116

పునుఁగు జవ్వాది కస్తూరి పూసినీకు
సేవఁజేయంగ మదినిఁ గాంక్షింతుఁగాని
పేదవాఁడ నేనేమి యర్పింపఁగలను?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 117

షడ్రసోపేతమైన భోజనమునీకుఁ
గూర్చఁగాలేనుగాని, నా కూర్మివంటు
కంబుఁదినిపింతు భక్తిదుగ్ధంబుతోడ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 118

నేయివోసిన భగ్గను నిప్పువోలెఁ
గోరికలు హెచ్చి యెదను గగ్గోలుపఱుపఁ
గ్రిందుమీఁదగు నన్ను రక్షింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 119

శక్తి క్షీణించె ధైర్యంబు సన్నగిల్లె;
స్వాతిశయము దొలఁగెఁ బ్రాణభీతి హెచ్చె;
నీవె గతి నాకు వేఱొండు దైవ మెఱుఁగ
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 120

రామునామ మందారమరందధార
లనిశమానందమునఁ గ్రోలునట్లు మాము
కాత్మ పుష్పంధయమును సమాదరింపు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 121

మిహిరకోటిప్రకాశ! నీమహిమ లెన్న
నలువకును వేయుపడగలచెలువకైన
వశముగాదన్న నేనెంతవాఁడనయ్య!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 122

ఫుల్లహల్లకసౌగంధ్య ముల్ల మలరఁ
జేయునట్లు నీపైని నేఁ జెప్పుకైత
నాకు నిర్భరానందసంధాయి గాదె
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 123

నిర్వికల్పసమాధిలో నిన్ను నేను
నిత్యచైతన్యమూర్తిగా నిరతితోడఁ
గాంచునతిలోకభవ్యభాగ్యమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 124

అస్తినాస్తిసంశయముతో నలమటించి
తావక నిగూఢ పరతత్త్వ తంత్రమేమొ
కానలేని శాలీను నన్ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 125

అభ్రగంగానదీ ప్రవాహమ్మువోలెఁ
జాలువాఱు శ్రుతిహిత ప్రశస్తకవిత
లల్లఁగలవారె కవులు నీయండలేక?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 126

"రామ""కృష్ణ"యనెడు భవన్నామగోస్త
నీరసాస్వాది యైనట్టి నా రసనకుఁ
బలురుచులపై నపేక్షయే పగిదిఁగలుగు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 127

తనువు పులకించిపోవు నీ దర్శనమున
వీక్షణంబుల హర్షంబు వెల్లివిరియు
మనసు శాంతినిశాంతమై తనరుచుండు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 128

మూఁగ వక్తయై ప్రజకు సమ్ముదముఁ గూర్చు
కుంటి కుప్పించి లంఘించుఁ గొండలైన
నీ దయాపాంగలోచననియతిఁజేసి;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 129

అమ్మయొడిలోన సుఖనిద్ర నందినట్లు
నేను నీ పదాంబుజసన్నిధానమందు
నవ్యయానందమాధుర్య మనుభవింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 130

హృదయసింహాసనంబున ముదముతోడ
నిన్నుఁగూర్చుండఁ బెట్టి నా విన్నపములు
చెప్పఁగానెంతు వేగవిచ్చేయు మయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 131

అండపిండవేధోండనాయకుని నిన్నుఁ
ద్రికరణస్ఫూర్తిగాఁ బ్రస్తుతించువారి
కైహికాముష్మికఫలంబు లబ్బ కుండె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 132

సూర్యకిరణముల్ జగమెల్ల సోఁకునట్లు
తావకకృపాసుధావృష్టి దాసజనుల
పైని వర్షించి వారికిఁ బ్రమద మిడదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 133

నాకు నీపాదసేవయే నాకలోక
సౌఖ్యమునకంటె నధిక హర్షమునుగూర్చుఁ
గాన నాకట్టి మహితనిధాన మిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 134

క్షీరనీరవిభాగంబుఁ జేసి హంస
క్షీరమును గొన్న రీతి మాచేష్టలందు
మంచినే యెంచి చెడు రూపుమాపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 135

కాలిధూళి సోఁకిన ఱాయి కాంత యగుట
వింతలకు నెల్ల వింత యీ విశ్వమందు
వాకొన వశంబె? నీ ప్రభావంబు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 136

ఎన్ని రూపులు దాల్చి నీవున్నఁగాని
నామదికి నీవు సచ్చిదానందమూర్తి
వై యజస్రము దోఁచి సౌఖ్యమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 137

నీదు శ్రీపాదరేణువు నాదుశిరము
సోఁకెనేని మత్కల్మషస్తోమమెల్లఁ
దొలఁగి నిస్తుల సుకృతముల్ పొలుచునయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 138

నెలవుకొన్నవి ముదిమిచిన్నియలు మేన
నీదుసేవ చేయంగ నింద్రియములింక
వశముగాకున్న ననుఁ దప్పుపట్టకోయి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 139

కుక్షిఁ బదునాల్గు లోకముల్ గొమరు మిగుల
నిల్పి కాపాడు దేవర నీవ కావె?
సాటియెవరయ్య నీకు నిస్తంద్రతేజ !
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 140

తలఁచినంతనె భక్త సంతతికి నెల్ల
వెతలుదీటిచి సౌఖ్యసంహతుల నొసఁగి
యాదుకొనువేల్పవని నిన్ను నభినుతింతు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 141

కలుషభావంపు వఱదల మలినమైన
చిత్తనిమ్నగ భవదీయ చింతనంపు
స్ఫటికసంస్పర్శచే శుభ్రపడునుగాదె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 142

సడలె దేహవల్లరి; శిరోజములు నఱసె
మాట తడబడెఁ గోర్కెలు మాత్ర మొక్క
రీతి సిరికలెత్తి యూరింపసాగె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 143

మనసు తాదాత్మ్యమందు నీ మందిరమున
నిలిచి నీరమ్య రూపంబు నేత్రపర్వ
ముగ విలోకించు సుజనసమూహమునకు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 144

ఉపనిషత్సార మంతయు నొడిసిపట్టి
పండితుండైన నేమి లాభంబుగలదు
తావక పవిత్ర నామచింతనము లేక ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 145

ఫలమొ పుష్పమొ తోయమొ కలిగినంత
నీకు నైవేద్యమొసఁగి ధ్యానించువారి
సంకటముఁ బాపు భక్తవత్సలుఁడ వీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 146

జగము సృజియింపఁ బోషింప సమయఁజేయ
బ్రహ్మ విష్ణు రుద్ర స్వరూపములతోడఁ
గొలువఁబడెడి త్రిమూర్త్యాత్మకుండ వీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 147

ఉత్తమోత్తమ నరజన్మ మెత్తికూడ
పొడుపొట్టకై వ్యాకులపడునుగాని
జనుఁడు భవదీయతత్త్వజిజ్ఞాసఁగన్నఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 148

కామమున గోపికల్, భీతిఁ గంసుఁ, డమిత
భక్తి భీష్ముండు, మైత్రి విశ్వచ్చుఁ దుగ్ర
వైరవృత్తిఁ జైద్యుండు నిన్ జేరికొనరె ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 149

కారుమబ్బుల మెఱపులు గానవచ్చు
రీతి విపదంధకారసంఘాతమందు
నీకృపాజ్యోత్స్న మాకుఁ గన్పించుఁగూర్చు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 150

బాల్య కౌమార యౌవన వార్ధకములు
నాల్గుదశలు గల్గియును మానవుఁడు నిన్నుఁ
జిత్తశుద్ధిఁ గొలువ సమాయత్తపడఁడు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 151

గగనసుమమయ్యె నేఁడు నిష్కామభక్తి
ప్రతిఫలాపేక్ష లేక యెవ్వాఁడుఁగూడ
స్థిరమతిని నిన్నుఁదలఁప యత్నింపఁడయ్యె
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 152

ధాత్రిలో నిన్ను మించు ప్రత్యక్షదైవ
మెవరు స్వామి? నేఁగడగండ్ల బవరమందుఁ
జిక్కు కొంటిని నన్గటాక్షింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 153

కోరికల బెబ్బులుల్ చిత్తగుహను దూరి
సంతతము బొబ్బలిడఁగ స్వాస్థ్యంబుఁదక్కి
విహ్వలుఁడనైన నన్గావ వేగ రమ్ము
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 154

మెఱపుమెఱసినసమాడ్కి నామెదడులోన
హృద్యపద్యముల్ నిరవద్యరీతిఁ గదలి
పర్వులెత్తుట నీ కృపావశతఁగాదె !
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 155

భవదుపాంతరమ్యభవనోపరితలంబుఁ
జేర నిర్వ్యాజభక్తినిశ్రేణి నెక్కి
యుద్యమించెడు నాకుఁ జేయూత నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిధేవ! 156

తలఁపులన్నియు నీయందె నిలిపి, త్రికర
ణంబు లెప్పట్టునఁ జపలత్వంబు నొంద
కుండ నినుఁగొల్చు కలిమి నా కొసఁగుమయ్య;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 157

నా మనోరథములుదీర్చు స్వామి యంచు
నిన్నడుగఁగూడ దనుకొందు, నిజము సెప్ప
నంతరంగము నేఁ జెప్పినట్లు వినదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 158

కానికలుదెచ్చి యిచ్చెడివాని కీవు
వరము లిచ్చుటయెబ్బంగి పాడియయ్య
శ్రీపతివి నీకు లోటేమి సిరినిగూర్చ?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 159

దండధరుఁబ్రోల భయదవేదండపాద
ఘట్టన నలంగి మేను కళావికలయి
పోవ నిచ్చగింపను; నాకు ముక్తినొసఁగు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 160

ప్రతిపదము భవద్వర్ణనాస్పదముగాఁగ
నాదురసనపై నిరతంబు నలువచెలువ
నిలిచి పల్కునట్లుగఁ గరుణింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 161

నన్ను భవపాశమునఁ గట్టు నిన్ను నేను
భక్తిపాశముతోఁ గట్టి పంతమలర
హృదయదేవాలయంబున నెలమి నిడుదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 162

విడువనయ్య నీపాదారవిందసేవ;
నదియె మద్భవరోగ దివ్యౌషధంబు
గాన నాకట్టి మహితభాగ్యమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 163

రిక్తహస్తాలతోడ నర్చింప నిన్నుఁ
జేరితి ననుకోకు; మదీయ చిత్తసుమము
నీ కుపాయన మొనరింతు స్వీకరింపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 164

నీదుగుడిచుట్టు వలగొని నెమ్మనంబు
భవదమృతనామచింతనాపారవశ్య
మందుఁ దేలఁగాఁ దృష్టిఁ గన్గొందు నిన్ను
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 165

పెరటిలోన నీవులబ్రమాను వెలసినట్లు
వెలిమొదవు చేరువకువచ్చి నిలిచినట్లు
నీవు ప్రత్యక్షమై నన్నుఁ బ్రోవుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 166

పూచు నిన్నెంచ నామేనఁ బులకవల్లి;
ఆపదలు గడతేర్చు కన్నయ్య నీవు
కొండదిగివచ్చి నాయెద నుండుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 167

దవ్వు నెంచక నీ సన్నిధానమునకుఁ
జేరితిమి మేము; కారుణ్యసింధువగుచు
నయనపర్వమ్ముగా దర్శనమ్ము నిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 168

భక్తులెందరొ నిన్నుఁగొల్చి ముక్తిఁబొంద
నా విషయ మీవు పట్టించుకో వదేమి?
పక్షపాతము చూప భావ్యంబె నీకు ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 169

సృష్టి పుట్టినదాదిగా నెన్ని జన్మ
లెత్తినాఁడనో నాకేమి యెఱుక లేదు;
నేఁటికైనను నను& గరుణింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 170

అస్మదానందకలశరత్నాకరమును
నింగి ముట్టెడునట్టు లుప్పొంగఁజేయు
పర్వశుభ్రాంశుఁగా నిన్ను భక్తిఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 171

రోమహర్షణ మొదవు నీనామమెన్న
జన్మసాఫల్య మగును నీచరిత విన్న
కలుము లొనఁగూడు నీదు వక్త్రంబుఁగన్న
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 172

భవదపారసేవాసరోవరమునందు
జలకమాడఁదలంచు నన్మనన్మనో మ
రాళ మపవర్గరమ్యహర్మ్యమును బొంద
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 173

బుద్ధిమాంద్యము వెన్నంటి ముసలితనము
రోగభరితమై బ్రదుకును గ్రుంగదీయ
నరుని కప్పుడు నీవు గన్పడుదువేమొ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 174

సత్య మారయ రోగముల్ జనులపట్ల
వరములేయౌను; లేనిచో వారునిన్ను
మదిని దలపోయువారె దుర్మదము హెచ్చి?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 175

పెద్దగండంబునుండి తప్పించి నన్నుఁ
బ్రాణభయము లేకుండఁ గాపాడినట్టి
నీకు హృదయపూర్వకనమోవాకశతము
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 176

పూర్వకృతకర్మఫలములు సర్వమాన
వాళి యనుభవింపక తప్పదన్న నిజము
నా కెఱుకయయ్యె నేఁటి గండంబువలన
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 177

రెండునెలలు పైఁబడినవి గండమునకు
నేను బాల్పడి, గాయంబు మానదేమి?
శీఘ్రమే దానిని నివృత్తిఁ జేయుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 178

నీవుతప్ప వేరెవ్వరు ధ్యానింప నాకు?
రుగ్ణుఁడైనట్టినాకు నారోగ్య మొసఁగి
చల్లగాఁజూడరమ్ము వాత్సల్యమెసఁగ
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 179

స్వేచ్ఛ యెక్కడిదయ్య నాజీవితమున
సతతతాపత్రయోగ్రపాశమునఁ జిక్కి
కలఁతవడునాకు బంధమోక్షమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 180

ఎందఱనొ ప్రోచితీవని యందు;రవని
నీదుభక్తులు; దానిని నేను నమ్మఁ
బోను; స్వీయానుభూతిని బొందువఱకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 181

చెవులుసోఁకిన నీదువంశీరవమ్ము
సృష్టిసర్వస్వమును బులకించిపోవు
నందు రార్యులు, నాకట్టివిందు నొసఁగు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 182

కష్టములువచ్చినప్పుడుగాని నిన్నుఁ
దలఁవనట్టియజ్ఞుని నన్నుఁదప్పుపట్టు
కుండ సైరణఁజేసి కైదండ నొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 183

చందనద్రుమంబున విషసర్పరాజి
చుట్టుముట్టినరీతి నన్బట్టివెతలఁ
బెట్టు పాపౌఘములను బోఁగొట్టుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లి దేవ ! 184

శ్రమము నొందితివేమొ శశ్వద్విలాస!
సృష్టిరక్షాభరంబు వహించి నీవు
సేదఁ దీరు మొకింత నా చిత్తశయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 185

ఉత్తమశ్లోక నిన్ను నా యుల్లమందు
నిలిపి భజియింపఁ గిల్బిషానేకపాళి
బెదరిచను సింహగర్జన విన్నపగిది;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 186

వాసనారూప సముదగ్ర వాయుహతికి
సమసిపోకుండ భక్తిదీపమును నీవు
కరపుటాచ్ఛాదనముతోడఁ గావుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 187

వలదు సురసద్మసౌఖ్యముల్ వలదు భోగ
భాగ్యచయము, కావలయు నీపావనాంఘ్రి
పద్మసంసేవనావైభవంబు నాకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 188

నీదుగుడిగంట మ్రోఁగిన మోదమెసఁగఁ
గోటి వల్లకీ తంత్రులు మీటినట్లు
పులకలెసరేఁగి నామేనఁ బొడమునయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 189

గమ్యమెఱుఁగక జీవితకాలమంత
వ్యర్థపుచ్చి పరితపించి భవదుపాంత
మునకుఁ జేరితిఁ గృప నన్నుఁ బ్రోవరావె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 190

భక్తి నినుగొల్చు వారికి ముక్తిమంది
ర ప్రవేశంబు కడు సుకరంబుగాదె?
సత్కృపాలోకసంతృప్త సాధులోక!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 191

నీవు నాకట్టెదుట నిల్చి-నిరుపమాన
భవ్యభవదీయ రమణీయవదన చంద్ర
బింబరోచిస్సుధల మురిపింపునన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 192

కలవు నవవిధభక్తి మార్గములు నీదు
సన్నిధికిఁ జేరఁ దలపోయు సజ్జనులకు
వానిలోనాకు సముచిత పథము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 193

సత్త్వగుణవిభాసితుఁడవు; తాత్త్వికాగ్ర
గణ్యుఁడవు; చరాచర జగత్కారణుఁడవు
మామకానందవనధివి; స్వామి! నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 194

భారతీరమ్యతరపాదనీరజాత
కింకిణీ నిస్వనంబును గ్రేణిసేయు
మృదులకవితాఝురీనాద మిమ్ము నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 195

తావక దశావతారగాథా స్రవంతి
నోలలాడ మాభవబంధజాలమెల్లఁ
ద్రెళ్లి నిర్వాణపదవి సిద్ధించుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 196

ఓపి కొక్కింతయును లేదు రేపు నాది
యౌనొకాదొ యనెడు శంక యావహిల్లఁ
జెచ్చెర నిను భజింతు; రక్షింపు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 197

అఖిలయోగప్రదుఁడవై యజాండమెల్ల
నిండియుండిన తేజోమయుండ వీవు
నన్ను నిత్యసంతుష్టు నొనర్పుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 198

పాపకృత్యముల్ చేసినవాఁడ, దైవ
దూషణకుఁ బాల్పడిన వాఁడ, దోషకలితు
నాశ్రయార్థిని మన్నింపుమయ్య నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 199

ఇహమునందు నకాలమృత్యుహరణంబుఁ,
బరమునందు వైకుంఠనివాసయోగ
సిద్ధి యగుఁగాదె నిన్నుఁబూజించు ప్రజకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 200

జీవుఁడను నేను, పరమాత్మ వీవు; కింక
రుండ నేను; జగద్వల్లభుండ వీవు
పతితుఁడను నేను పరమపావనుఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 201

భావదారిద్ర్య మెచటుఁ దోఁపంగనీక
భక్తిరససుధాఝరి పరవశ్యుఁద్రొక్క
నటుల మత్కవిత్వముఁ దిద్దుమయ్య నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 202

ఏలొకో తెలియని యసంతృప్తి నాదు
హృదయకుహరమునందుఁ జేరినది తండ్రి!
శీఘ్రమే దాని దూరంబు చేయుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 203

మ్రొక్కుబడులు చెల్లించి నీమ్రోల నిలిచి
కోర్కెలను దీర్పుమని నిన్నుఁ గోరఁబోను
నుంత దయఁజూప నిన్నుఁ బ్రార్థింతు నెదను!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 204

ప్రత్యహము నీదు చరణనీరజరజంబు
నొదల ధరింప నీకు సాష్టాంగపడుదు
ప్రేమమీఱ నాకట్టియదృష్ట మిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 205

వానఁదడియనివాఁడు నిర్వ్యాజమైన
భవదపారకృపావృష్టిఁ బరవశింప
నట్టి భక్తుఁడు గలఁడె యీ యవనిమీఁద?
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 206

బ్రతుకువైకుంఠపాళిలో వెతలచిలువ
పైకిరాకుండ సతము నన్ బట్టిమ్రింగు
నభ్రగపతివై నీవు నన్నాదుకొనవె!
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 207

శుచినో నే నశుచినో మనస్సునకు సుంత
కూడఁదోఁచదు నిను భక్తిఁగొల్చువేళ
దోషమెంచక నాకుఁజేదోడుకమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 208

సర్వనదులు సాగరములో సంగమించు
నట్లుగా నీకుఁ బ్రతిరూపులై వెలుంగు
నఖిలదేవతార్చనలు నీ కందుఁగాదె,
బాలబాలాజి, అప్పనపల్లిదేవ! 209

భక్తిమాకందతరువుపైఁ బరవశించి
ప్రణవగానమొనర్చు ద్రైవస్వరూప
పికవరేణ్య! సద్గతిని జూపింపు మాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 210

పాదమున గంగ, బొడ్డున బ్రహ్మ, యురము
నందు లక్ష్మి, కన్నులుగ సూర్యహిమకరులు,
పాన్పుగఁబెనుఁబాము,గల విశ్వపతి వీవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 211

పుట్టినదిమొదల్కొని చనిపోవువఱకుఁ
గష్టములుదప్ప వెంతటిఘనునికైన;
నరుఁడవై నీవు పడవె బన్నములు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 212

పామరుఁడు నిన్ను ఱాయిఱప్పగభజించు;
జ్ఞాని నామరూపరహితుఁగా నెడంద
నెంచు; నెటులైన నీవె మాకేడుగడవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 213

వెన్నదొంగవై దీనులవిన్నపములు
విన్నదేవరవై కనుసన్నలోక
పాలన మొనర్చు నిన్ను సద్భక్తిఁదలఁతు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 214

ఎంతవర్ణించినను నిన్నుఁదృప్తిలేదు
వాగతీతుఁడవౌ పరబ్రహ్మమీవు;
బాలిశుఁడ నేను పేర్కొనవశమె నిన్ను?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 215

మనసు నిల్వ దేలొకొ క్షణమాత్రమైన
నిర్మలంబుగ నిన్ను ధ్యానింపవలయు
నన్ను; నలసు నన్ మన్నింపుమయ్య కృపను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 216

కష్టములమబ్బు దొంతరల్ గ్రమ్ముకొనిన
నీ కటాక్ష ప్రభంజనాస్తోకధాటి
కెదురునిల్చునె చిద్రుపలై చెదురగాని?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 217

స్వామి! భవదాలయద్వార సవిధమందు
నిల్చి నీ దివ్యమంగళనీలదేహ
కాంతిరించోళి నను సోఁకసంతసింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 218

ఇందుఁగల వందులేవను సందియమ్ము
ప్రజలయెదఁగల్గకుండ సర్వత్రనీవు
దర్శనంబిచ్చి రక్షింపఁదరలిరమ్ము
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 219

నిన్ను నమ్మి చెడినవాఁడు నిఖిలజగము
లందు లేఁడని యెంచి యవ్యాజభక్తి
నిన్నె సేవింతు నన్నరుణింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 220

నియమనిష్ఠాగరిష్ఠులు నిత్యసత్య
రతులు వైఖానసాదిసద్వ్రతులు నిన్ను
నుంత గానలేరన్న నేనెంతవాఁడ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 221

భవ్యభవదీయ కృష్ణరూపంబు నేను
స్వప్న జాగ్రత్సుషుప్తుల క్షణముగూడ
విడువకుండ వీక్షించు సద్విభవమిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 222

రాఘవేంద్రయతిని, పోతరాజకవిని,
త్యాగరాజ వాగ్గేయకోత్తముని నీవు
ప్రోచిన తెలుంగుమాకు సమ్మదము గూర్చు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 223

ఆత్మనిగ్రహశక్తి, సత్యానురక్తి,
విమలతరభక్తి, మధురోక్తి వేడ్క నాకొ
సంగి కృపఁజూడుమయ్య వాత్సల్యమెసఁగ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 224

అడుసు ద్రొక్కి పిదపఁగాళ్లుగడుగుకొన్న
రీతి దుష్కార్యములొనర్చి భీతి నిన్నుఁ
జేరి మ్రొక్కెదుమమ్ము రక్షింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 225

మామకహృదయనందనారామసీమ
భవదపారకృపాఝురుల్ పాఱనేని
భక్తిమందారసూనముల్ పరిమళించు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 226

ఎంతమొఱపెట్టుకొన్న నావంతఁ దీర్ప
రా వదేల? వెనుకగజరాజు నీవు
బ్రోచినట్టి గాథను నమ్మి బోను నేను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 227

స్వర్ణహారము లొసఁగి; దేవళము గట్టి
గారవించినభక్తుఁడు ఖైదు జేరె
భక్తి నినుఁగొల్వ ఫలిత మిప్పగిదియౌనె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 228

నీదుపదభక్తినిరతుఁడ నిన్నుఁదప్ప
నన్యదైవములను వేఁడనట్టివాఁడ
నిస్సహాయుని నన్గుణింపరావె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 229

పాపకర్దమదుర్గంధభరితమైన
మత్తనువు భవదీయనామస్మరణను
రాపగావగాహమున ధన్యతను గనదె?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 230

పలుకుఁబూబోఁడి నెదలోననిలుపుకొన్న
కవివరులెనిన్ను వర్ణింపఁగలరొ? లేరొ?
నామమాత్రపుఁగవిని నే నేమొనర్తు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 231

నన్ను సదసద్వివేకసంపన్నుఁజేసి
భక్తివైరాగ్యభావప్రవర్ధనునిగ
నీపదాంభోజసన్నిధి నిలుపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 232

కేవలము దేవళమ్మునసీవు వెలసి
నాఁడవను నమ్మకము విడనాడి మేము
నలుగడల నిన్ను దర్శించు కలిమినిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 233

గోవుతో గురువులువాలు కోడెభంగి
నిన్నుఁ గనువేడ్క వచ్చు విపన్ను నన్ను
నీదు మృదులాంక శయ్యపై నిలుపు మభవ!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 234

అవధరించినకొలఁది నీయమృతచరిత
మంతరంగ నైర్మల్యంబు నందఁజేసి
యుష్మదంఘ్రిసామీప్యంబు నొసఁగుఁ బ్రజకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 235

ఆశ లడియాసలై నిస్పృహాగ్ని శిఖలు
సోఁకి శోషిల్లునన్ను నిస్తుల భవత్కృ
పాకటాక్షసుధావృష్టి సోఁకుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 236

ఐదుపదిచేసి నీయాలయాంతరమునఁ
దనువు ధనువురీతి నవనతంబొనర్చి
పాహి మాం పాహి యనునాకుఁ బ్రాపునీవె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 237

హరివొ క్రీస్తువొ అల్లావొ యరయ నిన్ను
నేమిపేరునఁబిలిచిన స్వామి! మాకు
నేత్రపర్వమొనర్పఁ గన్పింపుమయ్య!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 238

అఖిలవేదపురాణశాస్త్రాఽధ్యయన మ
హితఫలము గల్గుఁగాదె దృఢతరభక్తి
నిన్నొకపరి స్మరించు విపన్నతతికి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 239

జపతపోధ్యాన నిరతులు సన్మునీంద్ర
వర్యు లర్చించు భవదంఘ్రిపద్మయుగళి
యక్షయసుఖప్రదాయియై యలరుఁగాక;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 240

పట్టుతేనెకంటె రసాల ఫలముకంటె
గోస్తనీగుళుచ్ఛముకంటె గొప్పదైన
నీపవిత్రనామరుచి వర్ణింపఁదరమె ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 241

పాలసంద్రపు టలల నుయ్యాలలూఁగి
పాపఁడేని మవ్వపుసెజ్జఁ బవ్వళించి
కలిమిచెలిదోరవలపులఁగులుకు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 242

చక్కనయ్యవునీవు నిన్నొక్కమాఱు
తనివితీరఁజూచిన దురితంబులెల్లఁ
దొలఁగి సమధికశ్రేయముల్ గలుగఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 243

అవ్యయంబగు నీ కరుణామృతంబు
భక్తిభృంగారముల నేను బట్టి భృశము
త్రావనెంతును దివ్యనిర్వాణమంద;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 244

సుప్రభాత సేవాపరాస్తోకమతులు
పుడమివేల్పులు ప్రామినుక్కనుదుల నిన్నుఁ
బ్రస్తుతింప మాకు శ్రవణపర్వ మొదవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 245

అమృతరుచిమించు సత్కవిత్వము నొసంగి
మధుర మంజుల కావ్యనిర్మాణ దక్షుఁ
జేసి చిరయశస్కుఁగఁ గటాక్షింపు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 246

ఎంతదైవోపహతులైన నెంత నిన్నుఁ
దలఁచినంతనె వారి ఖేదంబు దొలఁగి
మోద మరచేతియుసిరికై పొల్చుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 247

ముగ్ధమోహనమైన నీముద్దుమోము
నిర్నిమేషదృష్టుల నిదానించిచూచు
దివ్యవైభవమును బ్రసాదింపు మాకు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 248

లావకాపాంగ వీక్షణోత్పలములందుఁ
గమ్ము కరుణామరందంబు గదలియాడ
భక్తబంభరబృందంబు పగవశించు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 249

మహితలావణ్యరాశి పద్మావతీ ల
తాంగి యలమేలుమంగతాయారు తలఁపి
వలపువెన్నె లదోఁగునిన్ దలఁతుఁనెపుడు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 250

నీ దరస్మితచంద్రికల్ నిగుడుచోట్ల
దుర్భరామయధ్వాంతసందోహ మెడలి
విమల శాంతి సౌభాగ్యముల్ విస్తరిల్లు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 251

సగుణ నిర్గుణ పరతత్త్వమగుటు నిన్ను
వివిధరీతుల దర్శించి విబుధవరులు
సంసృతి మహార్ణవ తరణ చణులుగారె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 252

పవన చలిత కదంబ పల్లవమువోలె
మృత్యుభీతిఁ గంపించు నాయెదను నీవు
పవ్వళించినఁ గొండంతబలము నాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 253

హృదయవామలూరువునుండి యెగసిపడెడు
కోపకాకోదరంబును రూపుమాపు
తాపహావ్యయదండమున్ దలఁతు సతము
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 254

ప్రాణదీపంబు కొడిగట్టువఱకు నీకు
సేవఁ జేయుదు; నాశేషజీవితమును
జక్కదిద్దవె యెట్టి కష్టములు లేక;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 255

ముదిమి పైకొని రోగముల్ ముసిరి, కఫము
కంఠమునఁ జేరి తీవ్రగాఢ్గద్య మొదవ
భావిగతి నెంచి యిపుడ నిన్ బ్రస్తుతింతు
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 256

ఏ పగిది నిన్నుఁ బూజించి నీపదాబ్జ
సన్నిధికిఁ జేరుకొందునొ స్వామి నాకుఁ
దెలియఁ జెప్పుము మదిలోనఁ గలతదీఱ
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 257

బాడబానలక్షుభితార్ణవంబురీతి
వ్యథలఁ గ్రాగెడి యెడఁద నవ్యాజశాంతి
వృష్టిఁ గురియించి నాకు సంతృప్తి నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 258

విధివిలాసము నెవరు తప్పింపఁగలరు
జరుగ బోయెడి దేదియో జరిగితీరు;
మీఁదుమిక్కిలి నిన్ను నమ్మితిని దండ్రి
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 259

సానఁబట్టినకొలఁది వజ్రంబు తళుకు,
లీను గతి భవచ్చింతనాధీనహృదయు
డష్టకష్టముల్ పాసి సౌఖ్యంబుఁ గనఁడె,
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 260

వెన్న జిడ్డుకెమ్మోవినిఁ జెన్నుమీఱ,
మురళి మ్రోయించి సృష్టిని మోహపఱుచు
వ్రజకులాంగనాస్మర! నాకుఁ బ్రాపునీవె;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 261

శ్రవణసుభగములైన నీ చారుచరిత,
లెన్ని మాఱులు వర్ణించియున్నఁగాని
తృప్తిఁగనలేరు సుకవులదేలసామి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 262

నల్లనయ్యగఁబుట్టి వ్రేపల్లెలోన
గొల్ల యిల్లాండ్ర యీలువుల్ గొల్లగొట్టి
భక్తజన భాగధేయమై పరగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 263

ఎంత మధురాతి మధురమో యెంచలేను
నీదునామపీయూషంబు; నెమ్మిదాని
బత్తిదోసిళ్ళఁ ద్రావి నేఁ బరవశింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 264

సర్వవేళల నిన్ను సంస్మరణఁజేసి
చర్మచక్షుర్యుగమ్మునఁ బేర్మిఁజూచు
గలిమి నిమ్ము నేను మఱేమి కాంక్షసేయ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 265

ధాత్రి నెంగిలి కాని పదార్థమేది
కలదు? నీపూజకొఱకు, నిర్మలమదీయ
హృదయసుమమునె నీకు సంప్రీతి నిడుదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 266

ఆశువుగ మనోహరకవితాంబురాశి
పొంగి పొరలిన సుకవి సమ్మోదమంది
యచ్యుతుని నిన్నుఁబొగడి విఖ్యాతిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 267

ఆణిముత్యాలఁబోలు పద్యాలు వ్రాసి
భక్తి నీకు హారముగ నర్పణమొనర్తు
నెలమి నాదు కాన్కను గ్రహియింపుస్వామి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 268

సర్వభారము నీ భుజస్కంధమందు
మోపి, నేఁ క్రియాశీలినై యోపినంత
యత్న మొనరింతు నాకు జయమ్ము నిమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 269

మానసికరుగ్ణతకు మందు కానరాదు
ధరణి నీ దివ్యనామచింతనమె యెట్టి
వ్యాధినైన నిర్మూలించునట్టి మందు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 270

"తత్త్వమసి"యన్న పదమె యుత్సాహపఱచి
స్వపరభేదరాహిత్యు; నిస్సంగు నిన్నుఁ
గాంచు మార్గము నాకుఁజూపించె నెదను
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 271

పిలిచినంతనె మఱుమాట వలుకు దొడ్డ
వేల్పుదొరవీవు; నాపైని బ్రేమఁజిలికి
యనుఁగుబిడ్డగ గుండెకు హత్తుకొనవె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 272

అవసరార్థము వచ్చుబంధువులె తప్పు
మమత లొలికించునట్టి చుట్టములు లేరు
భువిని నాకు నిజమగు నాప్తుఁడవు నీవె;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 273

అబ్జభవముఖ్యబ్రహ్మర్షిముఖార్చితములు
సౌరశైవలినీ జన్మకారకములు
మోక్షదములైన నీపదమ్ములు భజింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 274

తల్లివియుఁ దండ్రివియు గురూత్తముఁడవును
స్నేహితుఁడవును నన్ను రక్షించునట్టి
వేల్పువును నీవెగా మది విశ్వసింతుః
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 275

త్వన్ముఖోద్గీత మంజుగీతా సుధార
సంబుఁ గ్రోలెడి సుమతి శశ్వదపవర్గ
దివ్యవైభవమంది సంతృప్తిఁ గనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 276

యతులు ప్రాసల కొఱకుఁ బ్రయాసపడక
సురధునీఝరీ సన్నిభ స్ఫూర్తితోడ
మత్కవిత్వంబు నీపయి మరలనిమ్ము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 277

హృదయపద్మవాసివని నిన్నెఱుఁగలేక
కొండకోనల నిన్గనఁగోరువార
లెంత వెఱ్ఱులో నే వచియింపలేను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 278

తావక పదాబ్జరజము మత్తనువు సోఁకె
నేని జన్మజన్మాంతర కృతదురంత
పాపముల్ వాసి, నే భాగవతుఁడ నగుదు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 279

గగనవీథీ విహార రాకా సుధామ
యూఖబింబంబువోలె నాయుల్లమందు
సంచరింపుము నీవు హర్షంబుగూర్ప;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 220

చుట్టుగై దువుజోదవై సోకుమూక
నెల్ల బెరుటాలమునందు ద్రెళ్ళజేసి
పుడమిజేజేల జోతలు పొందు స్వామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 281

లోకములు లోకపాలురు లోకవాసు
లందఱు దెగిన దుది లోక మంతరింప
బృథుతమమున నేకాకృతి వెలుగు వరద!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 282

మార నలకూబర జయంత మధు సుధాంశు
రూపగర్వాతిశయమును ద్రోసిపుచ్చు
మేటి యందగాడవు నీకు సాటియెవరు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 283

వారిచర కూర్మ కోలంబ నారసింహ
ఖర్వ భార్గవ రాఘవ కంసదమన
బుద్ధ కల్క్యాది రూపప్రసిద్ధచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 224

నిన్ను రథసారథిగఁ జేసికొన్న పార్థుఁ
డెంత మహిమాత్ముఁడో మది నెంచలేను
శ్లాఘ్యముకద నీభక్తవాత్సల్యగరిమ;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 285

ఏమి పున్నెము చేసెనో స్వామి నీదు
మోవి నటియింపఁ బిల్లనగ్రోవి తొల్లి
దాని భోగంబుఁ బేర్కొనఁ దరముగాదు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 286

నన్ను నీ కౌఁగిలికిఁ దీసికొన్న యెడల
నేమి చెప్పుదు నాభాగ్య మింద్రపదవి
యైన నాకుఁ దృణప్రాయమౌను సుమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 287

పులినసీమలఁ బిల్లలు బొమ్మరిండ్లు
కట్టి పడఁగొట్టుభంగి లోకములు నీవు
సృష్టిజేసి లయమొనర్తువేలస్వామి?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 288

ఇష్టకామ్యార్థ సిద్ధ్యర్థ మెవరునిన్ను
సతత మర్చింతురో వారి వెతలుదీర్చి
వితతవైభవ మొసఁగు శ్రీపతివి నీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 289

మోక్షదము లైన నీ పదాంభోజయుగళి
నమ్మి చేరినాఁడ నిక దండధరు కాల
పాశమున కైన నే వెఱవంగఁబోను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 290

చిన్నిబిడ్డఁడు తప్పులు చేసెనేని
తండ్రి మన్నించుభంగి సంతతము నేను
జేయు దోషవ్రజను నుపేక్షింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 291

బధిరునకు శంఖమధురనిస్వనము చెవిని
సోఁకనట్లుగాఁ బరమనీచునకు భవ్య
భవదమృతచరిత్రలు శ్రుతిపర్వమగునె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 292

కన్ను మూసినఁ దెఱచిన నిన్నుఁదప్ప
నితరదైవములను జూడనిచ్ఛగింప;
నాలసింపక నాకుఁ బ్రత్యక్షమగుము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 293

సామజవరద! నాపైనిఁ బ్రేమఁజూపి
సాంఖ్యయోగరహస్యము స్పష్టపఱిచి
విజయునకు దీటుగాఁగ దీవింపు నన్ను
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 294

పండువెన్నెలకంటె సౌపర్వ నిమ్న
గాజలముకంటె మిహికానగంబుకంటెఁ
జల్లనగు నీదు చూపులు చాలు మాకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 295

స్వామి! నీ పదాబ్జాతసేవామరంద
పాన మత్త మానసమధుపంబు, వివిధ
దైవ వరివస్యరుచి కెట్లు తనియుఁగలదు?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 296

నిలువుదోపిడి చేసెదు కలిమి దొరవు
కాన, నా దురంతదురితోత్కరమునెల్ల
దోచి, నన్ను సుకృతిగ నాదుకొన రావె!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 297

కోటియజ్ఞఫలము సమకూరుఁగాదె
వాసుదేవ! ని న్నర్చించువారి కిలను
బ్రహ్మభావన నొసఁగి కాపాడు నన్ను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 298

వరద! నీ కరుణాసుధాపాంగరోచి
సుంత ప్రసరించెనేని నావంతలెల్లఁ
బోయి బ్రతుకు క్షీరాబ్ధియై పొంగిపొరలు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 299

దాస్యభక్తికి నేను ప్రాధాన్యమిచ్చి
నిన్నె సేవింతు నాదగు నన్ని బరువు
బాధ్యతలను నీవె వహింపు స్వామి యింక!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 300

4. వివిధ దైవత భాగవతవర్ణనము

తిరుమలను వేంకటపతివై తేజరిల్లి
ముగ్ధమోహనరూపవిస్ఫూర్తి తోడ
చక్షురుత్సవ మొసఁగు నిన్ సన్నుతింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 301

అన్నవరమందు సత్యనారాయణుండ
వై యశేషజనావళి యార్తినెల్లఁ
బాఱ ద్రోలెడు నిన్ను సద్భక్తిఁ దలఁతు;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 302

సింహశైలాగ్రమున నధిష్ఠించి శ్రీనృ
సింహదేవుఁడవై జగచ్ఛ్రేయమునకు
వరదహస్త మందించు నిన్ బ్రస్తుతింతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 303

భద్రగిరిపైని శ్రీరామభద్రనామ
ధారివై యొప్పి జనకామితములనెల్లఁ
ద్వరితగతిఁ దీర్చు నీకు వందనశతంబు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 304

సూతశౌనకాదిమునులు ప్రీతితోడ
నైమిశారణ్యమందు ననారతంబు
నీదు భవ్యకథాలాపనియతిఁ గనరె?
బాలబాలాజి అప్పనపల్లి దేవ! 305

మూఁడుజన్మల వైరంబుఁబూని నీదు
ద్వారసంరక్షకులు నిన్నుఁ జేరిరన్న
స్వామిభక్తి కది నికషోపలముగాదె?
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 306

పృథివి సమలోష్టహేములై ప్రథితిఁగన్న
అంబరీషాదిరాజర్షు లమిత తావ
కీన శుశ్రూషచే ధ్రువకీర్తిఁగనరె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 307

రంతిదేవుఁడు ప్రాణనిష్క్రమణవేళ
జల మొసంగి పులస్కుని సాఁకి నీదు
శీతలకటాక్షవీక్షావిభూతిఁ గనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 308

ఆత్మసుతుని నారాయణ యనుచు మరణ
శయ్యనుండి పిలిచిన నజామిళునకు
సద్గతిని బ్రసాదించినస్వామి వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 309

గీతగోవింద కావ్యనిర్మాత కవివ
రేణ్యుఁడు జయదేవుఁడు నిన్నుఁ బ్రీతిఁ గొలిచి
పారలౌకికసౌఖ్యసంపత్తిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 310

హరిహరాద్వైతతత్త్వంబు వ్యాప్తిఁజేసి
తెనుఁగునుడులతో జయమును దీర్చినట్టి
తిక్కయజ్వ భవత్కృపాదీప్తిఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 311

పుణ్యచరితుండు బమ్మెరపోతరాజు
భాగవతకర్తగా ఖ్యాతిఁబడయుటకును
గారణము భవత్కారుణ్యగరిమగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 312

అమరవాగ్గేయకారుఁడు విమలకీర్తి
సాంద్రుఁ డన్నమాచార్యకవీంద్రుఁడు, నినుఁ
బదకవిత్వముతోడ లోఁబఱుచుగొనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 313

నాదచతురాస్యుఁడై జగన్నాథు నిన్నుఁ
దనివితీర శ్లాఘించిన త్యాగరాజు
సుకృతియై భవత్సాన్నిధ్యశోభఁగనఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 314

మువ్వగోపాలపదములు ముదముతోడఁ
బాడి క్షేత్రయ్య భవదీయభక్తికలశ
వార్ధిలోఁ దేలి, ధన్యజీవనుఁడుగాఁడె?
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 315

జలధి వటపత్రమందున విలయవేళఁ
జిన్ని పాపఁడ వైపండి సున్నితముగఁ
గాలిబొటవ్రేలు చీఁకు నీలీలలెంతు;
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 316

5. శ్రీ రామావతార లీలలు

పుత్రకామేష్టిఫలముగాఁ బుట్టి నీవు
దశరథోర్వీకళత్రునందనుఁడ వౌచు
రఘుకులాంబుధిశశివిగాఁ బ్రథితిఁగనవె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 317

ముగ్గురమ్మల ప్రేముడిపొంది, రామ
చంద్రనామంబుతోఁ బ్రజాస్వాంతములకుఁ
బ్రమదమొసఁగినట్టి పురుషోత్తముఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 318

గాధిసూనుని జన్నంబుఁ గాచుకొఱకు
ననుఁగుఁదమ్ముఁడు వెంటరా నడవికేఁగి
తాటకనువధించిన నీప్రతాపమెంతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 319

గౌతమమహర్షి శాపంబు కారణముగ
ఱాయియైన యహల్యను రమ్యపాద
రజముచే నాతిఁ జేసిన ప్రభుఁడ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 320

చెఱకుగడను గంధేభంబు విఱుచుకరణి
శివధనువుఁ దున్మి జానకీధవుఁడ వైన
పురుషమోహనరూపు నిన్ బొగడవశమె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 321

పితృవచఃపాలనార్థము విపినములకుఁ
జిగురుఁగెమ్మోవి పై దరస్మితము చింద
వెడలినట్టి యాదర్శపుత్రుఁడవు నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 322

నదిని దాఁటించిన గుహుని మదిని మెచ్చి
భవజలధి దాఁటు నతనికి భవదమేయ
సత్కృపాపోత మందించి సాఁకితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 323

భరతు నవ్యాజభక్తికిఁ బ్రమదమంది
పాదుకలనిచ్చి తన్మనోవాంఛఁ దీర్చి
రాజ్య మేలంగఁజేసినరాజవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 324

గడ్డిపోచ బ్రహ్మాస్త్రమై క్రమ్ముకొనఁగ
భీతిఁ గాకాసురుఁడు నిన్ను వేఁడినంత
నభయమొసఁగినట్టి శ్రితార్తిహరుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 325

శూర్పణఖ వచ్చి నీ తనూశోభఁగాంచి
మురిసి నినుగోర దానికి బుద్ధిఁగఱప
ముక్కుఁ జెవులు గోయించిన ప్రోడవీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 326

పంచవటిని ఖరాదిరాత్రించరాళి
నస్త్రనైపుణ్య మేపార యామ్యపురికిఁ
దరలఁ జేసిన జగదేకధన్వివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 327

ప్రాణములు పణంబుగ నొడ్డి పంక్తికంఠు
తోడఁ బోరి జానకినిఁ గాపాడ నుద్య
మించినట్టి పక్షికి మోక్షమిచ్చితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 328

శబరి యెంగిలిపండ్లు నిస్సంశయముగ
మెసవి యామెకుఁ గైవల్యమొసఁగుటన్న
నెంతగొప్పదేవుఁడవో మా కెఱుకయయ్యెఁ;
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 329

వాలి నొక్కకోలను నేలఁగూలనేసి
రవితనూజుఁ గిష్కింధకు రాజుఁజేసి
చెలిమికిని మాఱుపేరుగా వెలసితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 330

జవమున శతయోజనదీర్ఘ సాగరమును
దాఁటి సీతనుగాంచి తద్వార్తఁజెప్పి
నట్టి హనుమంతుఁ గడుమెచ్చినాఁడవీవు;
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 331

లంకకును దారిసీయుని లవణకంధి
పొగ రణంప బ్రహ్మాస్త్రంబుఁ బూన నీవు
కాళ్ల వ్రేళ్లఁబడినవానిఁ గాచితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 332

ఉడుతసేవకు ముదమంది యొడిని జేర్చి
దాని కుత్తమగతిని నుదారరీతి
నొసఁగిన పరమకరుణామయుండవీవు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 333

శాత్రవసహోదరుఁడు విభీషణుఁడు నిన్ను
శరణువేఁడ లంకాపురీశ్వరునిఁజేయు
వాని కభయమిచ్చిన వీరవరుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 334

వారధిని గట్టి వానరబలముతోడ
లంకకునుజేరి కుటిలుఁ బౌలస్త్యుఁగూల్చి
సీత చెఱను బాపిన రఘునేతవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 335

భరత లక్ష్మణ శత్రుఘ్న వాయుజ రవి
సుత విభీషణాది హితులు నుతులొనర్పఁ
బుడమి నేలిన రామభద్రుఁడవు నీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 336

6. శ్రీ కృష్ణావతార లీలలు

దేవకీవసుదేవుల దిగులుమాన్ప
ముద్దు బిడ్డగఁ జెఱసాలఁ బుట్టి, గోకు
లమ్ము నోమిన నందబాలకుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ: 337

అబ్బురంబు గొల్పును యశోదమ్మ నిన్నుఁ
గన్న కొమరుకంటెను మిన్నగాఁ దలంచి
పెంచి పెద్దఁ జేసిన యితివృత్తమెన్న
బాలబాలాజి: అప్పనపల్లిదేవ! 338

పూతనావిషస్తన్యమభీతిఁ గ్రోలి
దానిప్రాణముల్ దీసి సద్గతినొసంగి
వాసికెక్కిన గోపడింభకుఁడవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 339

అమ్మ నే మన్నుఁ దినలేదు నమ్ము నాదు
పలుకు లని నోట బ్రహ్మాండభాండమెల్ల
హర్షమెసఁగఁ జూపిన పరమాత్మ వీవు;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 340

బుల్లిబొజ్జఁ జతుర్దశభువనములను
మోయు టెఱుఁగని తల్లి నీ సాయమేమి
లేక నినుఱోటఁ గట్టఁ గల్గెనె రవంత?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 341

కడిఁది కార్చిచ్చు మ్రింగిన ఘనుఁడవీవు,
ధేనుకాసురుఁ జంపిన దిట్టవీవు,
శకటదైతేయు నదిమిన జాణవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 342

చారుయమునా స్రవంతికా సైకతముల
వల్లవార్భకసహపంక్తి నుల్లమలరఁ
జల్దిఁగుడుచు నీతీరు ముచ్చటను గొలుపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 343

నందగోకులమందు నానందమొప్ప
గొల్లపిల్లలతోడ నిల్లిల్లు నీవు
కొల్లగొట్టుగాథలు మాకుఁ గుతుకమొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 344

భయదకాళియ పన్నగఫణములందు
భూచరులు ఖేచరులు మనోమోదమంద
నృత్యకేళీవినోదంబు నెఱపితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 345

నగ్నదేహలై యమునలో స్నానమాడు
గోపికల చీరలు హరించి గొప్ప తత్త్వ
బోధఁ జేసిన ధార్మిక మూర్తివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 346

కుండపోఁతగ వర్షంబుఁ గురియఁజేసి
గోకులము నాకులమొనర్చు గోత్రవైరి
యాటకట్టించినట్టి సాహసివిసీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 347

విశ్వమోహనమైన నీ వేణురవము
వినితరించినయాభీరవనిత లుర్వి
నేమినోములు నోచిరో యెఱుఁగ నేను;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 348

రమ్యబృందావనీ నాట్యరంగమందు
వ్రజవధూసహితుండవై రాసలీల
లభినయించిన నీమూర్తి నాత్మఁదలఁతు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 349

చేరువకు వచ్చినట్టి యక్రూరు మెచ్చి
యమునలోఁ గృతస్నానుఁడౌనతని కెలమి
విశ్వరూపంబుఁ జూపిన వేల్పవీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 350

గంధమాల్యానులేపముల్ గౌరవముగ
నీ కొసంగి కుబ్జ, భవత్కృపాకటాక్ష
మునఁ ద్రిలోకసుందరిగ నీ మ్రోల నిలదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 351

కువలయాపీడగజరాజుఁ గుప్పఁగూల్చి
మహితబలశాలిఁ జాణూరు మట్టుపెట్టి
బిరుదుమగఁడవై మధురలో వెలసితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 352

కఠినచిత్తునిఁ గంసునిఁ గసిమసంగి
తల్లిదండ్రుల ఘోరబంధములు వాపి
ద్వారకాపురి నేలిన స్వామివీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 353

ప్రముక్కడులు జరాసంధాదు లుక్కుమిగిలి
చివ్వకును నీపయినిఁగాలుద్రవ్వినపుడు
లీల వారి నోర్చిన శౌర్యశాలివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 354

రాక్షస వివాహమున రిపురాజినెల్ల
గడ్డి కఱపించి రుక్మిణీకన్యతోడ
విజయలక్ష్మినిఁ జేకొన్న విభుఁడవీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 355

రాజసూయాధ్వరంబునఁ బ్రల్లదంబు
లాడిన శిశుపాలుని, జక్రహతునిఁ జేసి
ధర్మజార్ఘ్యంబుఁ గైకొన్న దైవమీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 356

దుస్ససేనుఁడు ధూర్తుఁడై ద్రుపదతనయ
వలువ లొలువంగ నక్షయవస్త్రకలితఁ
జేసి యామెమానంబు రక్షించితీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 357

బాలసఖుఁడు కుచేలుఁడు భక్తిమీఱ
నటుకు లందింపఁ బ్రీతితో నారగించి
చిటికెలో వాని ధనవంతుఁ జేసితీవు!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 358

వీరశృంగారరసములు వెల్లివిరియ
నరిని వరుని మెప్పించు సత్యావధూటి
సమరకౌశల మెంచిన జాణవీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 359

సత్యభామకు గర్వభంజనము సేయఁ
దులసియాకునఁ ద్రాసులోఁదూఁగి పరమ
భక్తసులభుండ వన్న పేర్వడసితీవు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 360

రాజరాజు విం దొసఁగఁ దిరస్కరించి
విదురు నాతిథ్యమునకు సమ్ముదమునంది
భక్తవాత్సల్యమును స్పష్టపటిచితీవు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 361

కౌరవులు నిన్నుఁ బేరోలగమునఁ బాశ
బద్ధుఁ జేయఁగా విశ్వరూపఁబుఁ జూపి
వారి మౌర్ఖ్య మణఁచిన దైవఁబవీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 362

పుట్టిగ్రుడ్డియౌ ధృతరాష్ట్ర భూధవునకుఁ
జూపు నొసఁగి భవద్విశ్వరూపదర్శ
నాప్తినొదవించినట్టి కృపాబ్ధివీవు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 363

గాండివము చేయిజాఱె సంగరము సేయ
ననుచు నశ్రుసిక్తాక్షుఁడై యలమటించు
విజయునకు గీతఁగఱపిన వేల్పవీవు
బాలబాలాజి! అప్పనపల్లి దేవ ! 364

కోదమసింగంబు కుంభీంద్రుమద మడంప
నుఱుకురీతిఁ గురుక్షేత్రయుద్ధమందు
భీష్ముపైఁ దూఁకు నీ మూర్తిఁ బ్రీతినెంతు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 365

ఆజిలో ధార్తరాష్ట్రుల నణఁగఁద్రొక్కి
వసుధకును యుధిష్ఠిరు సార్వభౌముఁ జేసి
విశ్వసంక్షేమకర్తవై వెల్గితీవు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 366

అష్టభార్యలతోఁ బదునాఱువేల
గోపికలతోఁ బ్రణయకేళిఁ గుతుకమొప్ప
జరుపు నీదు రాసిక్య మాశ్చర్యకరము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 367

జయ విశుద్ధచైతన్యవిస్ఫారతేజ!
జయ యశోదాపురాపుణ్యసత్ఫలంబ!
జయ సమస్తలోకావనాసక్తచిత్త!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 368

జయ గభీరాబ్ధిగర్వభంజనమహాస్త్ర!
జయ వృషభనగవిహరణోత్సాహశీల!
జయ పయోరుహపత్రవిశాలనేత్ర!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 369

* ♦ *

7. సామాజిక స్పృహ

బురదఁ బుట్టిన తామరపూవు నీదు
పూజ కర్హమగుట లేదె? పుడమిలోన
గుణమె కాని కులమును బేర్కొనఁగరాదు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 370

హీనవంశసంభవయై యహీనమహిమ
సతులలోనరుంధతి సమున్నతినిఁ గాంచె
కులముగా దుర్వి నెంచఁగ గుణమెకాని
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 371

బోయవాఁడైన నేకలవ్యుండు తొల్లి
మేటి విలుకాఁడుగాఁ గ్రీడి మించలేదె?
గురుఁడు కోర నంగుష్ఠంబుఁ గోసియీఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 372

గుండె పిండు కవితలు కోకొల్ల లల్లి
తెలుఁగుజగతికి ఘనకీర్తిఁ దెచ్చినట్టి
జాషువా కవీంద్రుఁడు హరిజనుఁడుగాఁడె?
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 373

భవ్యభారతరాజ్యాంగభవనశిల్పి
న్యాయశాస్త్రకోవిదుఁడు మహామనీషి
సచివుఁ డంబేత్కరుఁడు హరిజనుఁడుగాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 374

సేతుశీతాద్రిపర్యంతభూతధాత్రి
ఖ్యాతిఁ గన్నట్టి యాది శంకరుని కెవఁడు
సర్వజనసమానత్వంబుఁ జాటిచెప్పె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 375

యుగయుగంబులనుండి యీ యుర్విలోన
రక్తదాహముఁ బెంచు వర్ణవ్యవస్థ
నడుపులోఁ బెట్టఁ గల్గు నాయకుని నిమ్ము;
బాలబాలాజి అప్పనపల్లిదేవ! 376

పుట్టగొడుగులవంటి యీ పుట్టువులకు
సార్థకతఁ జూపు లేనిచో నమసిపోవె?
కాలిన పెనంబుపై నీటికణములట్లు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 377

అహము తలకెక్కి పేదల నహరహంబు
ఘోర హింసల పాల్సేయు కుజనకోటి
గుండెలకు బల్లెమై నిలుచుండరాదె?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 378

పదవికై చేయరానట్టి పనులుచేసి
నీతి సూత్రాలు గోతిలోఁ బాతిపెట్టు
నేతలను దగురీతి దండింప రమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 379

గోముఖవ్యాఘ్రముల్ తడిగుడ్డతోడ
గొంతుఁగోసెడి తుచ్ఛులగుంపునుండి
బ్రతికి బట్ట కట్టఁగ మాకు గతిని జూపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 380

సరకులను దాఁచి నల్లబజారులందు
నిష్టమైన ధరకు విక్రయించునట్టి
మోతుబరి వర్తకుల పుట్టి ముంపరమ్ము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 381

అత్తయు నొకింటి కోడలేయనెడు సూక్తిఁ
ద్రోసిరాజని కోడండ్ర గాసిపెట్టు
పెంకియత్తలకును గనువిప్పునొసఁగు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 382

సంఘవిద్రోహ శక్తులు జాతినెల్ల
నల్లకల్లోల మొనరించి తల్లడిల్లఁ
జేయుచుండఁగ దగఁదుపేక్షింప నీకు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 383

ఎల్లమతముల సారాంశ మేర్పడంగ
దేవుఁ డొక్కఁడే యని తెల్పఁ దెలివిమాలి
జనులు కొట్లాటలకు దిగజాఱఁ దగునె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 384

పూఁటు కొకపక్షము వహించి "ఓటు" కొఱకుఁ
గల్లబొల్లి మాటలతోడఁ గప్పదాఁట్లు
వేయు నాయకమ్మన్యుల పీఁచ మణఁపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 385

కాలమానపరిస్థితుల్ గలసిరాక
బుద్ధిమంతులు పలుపాట్లు పొందుచుండఁ
బట్టనట్లుండుటది నీకు భావ్యమౌనె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 386

కులమతంబులు రెండు నరులను నేఁడు
పట్టిపల్లార్చు వ్యాధులై ప్రబలుచుండ
మంచి వెజ్జవై వానిని మాన్పుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 387

ప్రతిసమస్యను నేర్పుగా రాజకీయ
ముగ మలంచి లబ్ధినిబొంది మురియునట్టి
స్వార్థపరశక్తులకు గుదిబండవగుము;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 388

నశ్వరంబగుదేహంబు నమ్మి దాని
కూడిగముఁ జేసి భవదంఘ్రియుగ్మ సేవఁ
బడయని కుమతి జీవచ్ఛవంబ కాఁడె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 389

సదవగాహన లేని సంసారమందుఁ
గీచులాటలు తఱచుగా లేచు గాన
దంపతుల మధ్య సఖ్యంబు నింపు మభవ!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 390

మంచితన మన్న దెన్నఁడో మంటఁగలిసె
కరడు గట్టిన నిర్దయ కదనుద్రొక్కె
బడుగువర్గాల బ్రదుకు లెప్పగిదిఁ గడచు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 391

పెను సమస్యలు సృష్టించి మనుజ జీవి
తాలతోఁ బరిహాసంబు లేలనీకు?
సుంత దయఁ జూపి వారల వంతఁదీర్పు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 392

మనుగడయె లేని పంగ్వంధజనులు శోక
వారిధి మునిఁగి యల్లాడ వారి నేల
సాఁకరావు నీ కారుణ్యనౌకతోడ?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 393

అలి తెచ్చిన కట్నంబు చాలదనుచు
అత్తవారిల్లు గుల్లఁ జేయంగఁజూచు
మూర్ఖబామాతలకు నీవు బుద్ధిఁ గఱపు;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 394

కట్టు మందాశ పెరిఁగి లోకంబులోన
కన్నియల బ్రతుకులు వల్లకాఁడులయ్యె;
ఏల పాప మీ దురవస్థ? జాలిలేదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 395

కాలమే పరిష్కార మార్గమ్మునుమ్మ
దేనికైనను; మనుజుఁడు దీక్షఁబూని
దూరదృష్టి గమింపఁ జేకూరు సుఖము;
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 396

సరసకావ్యంబు ప్రియసుహృద్వరునిరీతి
యాపదల సహకారంబుఁజూపి, యాత్మ
ధృతిని బెంచి నరుని సరిదిద్దుఁగాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 397

చేఁదుతీపుల కలయికే జీవితంబు
పతియు సతియు వాగర్థసంబంధమూని
వరలిన బ్రతుకు బంగారుబాట కాదె?
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 398

జననమరణముల్ సుఖదుఃఖసముదయంబు
సృష్టి జీవకోటికిఁ గల్గఁజేసినీవు
అలఁతి నవ్వుచిందించు రహస్యమేమి?
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 399

శ్రద్ధగాఁ గవిత్వమువిని సద్విమర్శ
సేయు సహృదయ శ్రోతలు క్షితిని నేఁడు
నామమాత్రావశిష్టులైనారు సామి!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 400

ఆత్మవిశ్వాస మసదుగా నలముటించు
యువత కుత్తేజ మిచ్చి చేయూఁతనొసఁగి
కార్యశూరులఁ జేయు మవార్యచరిత!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 401

8 దశావతార వర్ణనము

ద్రుహిణుఁగను బ్రామి వేదముల్ దొంగిలించి
జలధి దాఁగిన సోమకుఁ జంపినట్టి
మత్స్యరూపావతార! యో మహితచరిత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 402

దేవదానవుల్ దుగ్ధాబ్ధి దీక్షతోడఁ
ద్రచ్చఁ గ్రుంకిన తరిగొండఁ దత్క్షణంబ
నోర్మితోమేనఁ దాల్చిన కూర్మరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 403

అసురవల్లభుఁ డా హిరణ్యాక్షుఁ డుర్వి
నొడిసిపట్టి వార్ధిని ముంపనున్న తటిని
కోరయంచున నిల్పిన క్రోడరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 404

ఇందుఁ గలఁడందు లేఁడను సందియమ్ము
వలదు హరిపట్ల నను పట్టిపైని గనలు
హేమకశిపునిఁ జీల్చిన నృహరిరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 405

బలిసురారాతినుండి త్రిపాదధరణి
దానముగఁ బొంది భూనభోంతరము నిండి
కరుణ నాతనిఁ గాచిన ఖర్వరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 406

అలిగి ముయ్యేడు మాఱుల నవనిపతుల
కంఠములు ద్రుంచి, మాతృశోకంబుఁదీర్చి
ప్రతిన నిల్పుకొన్న పరశురామరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 407

చెనఁటి దశకంఠు శిరములు క్షితిని రాల్చి
సతిని సీతనుగొని జగద్ధితముఁగోరి
రాజ్యమేలినయట్టి శ్రీరామరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 408

గీత బోధించి క్రీడి సంప్రీతుఁజేసి
రిపుసమూహము ననిలోనఁ ద్రెళ్లజేసి
కీర్తనీయుఁడవైన శ్రీకృష్ణరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 409

సత్యధర్మదయాశౌచసద్గుణాళి
నేల నాలుగుచెఱగుల నింపినట్టి
భూతకారుణ్యపరతంత్ర! బుద్ధరూప!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 410

ముష్కరులు చెలరేఁగి సామూహికముగ
ఘోరహత్య లొనర్ప నాక్రోశమందు
కాందిశీకులఁ గాచిన కల్కిరూప!
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 411

9 కృతికర్తృ విషయాదికము

పూజ్యపాదుఁడు బమ్మెరపోతరాజు
సత్కవియె నాకు మార్గదర్శకుఁడుగాఁగ
భవజలధి దాఁటు నీకృతి వ్రాసినాఁడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 412

రామపాదతీర్థంబుగాఁ బ్రథితికెక్కి
విమల గౌతమీ నిమ్నగోపేతమైన
భవ్య ధవళేశ్వరగ్రామవాసి నేను
బాలబాలాజి! అప్పనపల్లి దేవ! 413

శ్రీయగస్త్యేశ్వరస్వామి, శ్రీజనార్ద
నుండు శ్రీవాయుసుతుఁడు కొల్వుండియుచట
శ్రేయములొసంగి ప్రజను రక్షించుచుంద్రు
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 414

గ్రామదేవతగాఁ బేరుగన్న శ్రితజ
నావనాసక్త హృదయ ముత్యాలతల్లి
చలువదీవెన లందు బిడ్డలము మేము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 415

స్వామి సుందరచైతన్యసంయమీంద్ర
జలదగంభీరకంఠనిస్వానలహరిఁ
జెన్నుమీఱు మహత్తరక్షేత్రమిద్ధి
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 416

"శ్రీనికేతన" మను పేరఁ జెలువుమిగిలి
హృదయసమ్మోదమొసఁగు నా సదనమందు
శ్రీద్వితీయుఁడవై నివసింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ ! 417

ఖ్యాతిఁగన్న మెండా వంశమందు నేను
వెంకయమ్మ సత్యములకుఁ బ్రియతనూభ
వుండనై యొప్పి నీకు భక్తుండ నైతి,
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 418

నాదు సహధర్మచారిణి నమ్రచరిత
రాజరత్నాఖ్య నీభక్తురాలు ప్రోత్స
హింప నీ చతుశ్శతి రచియించి నాఁడ
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 419

నన్ను "చిన్నసీతారామ" నామ్ము; సరస
సాహితీస్వర్ణసౌధాగ్రసంచరిష్ణు
గూర్మిమెచ్చి యీ కృతినిఁ గైకొమ్ముస్వామి!
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ! 420

అమలవేదాంతపీథివిహారు నిన్ను
సాహసించి వర్ణింప నుత్సాహపడితి
నెరసులున్న వత్సలత మన్నింపుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 421

10 ఫలశ్రుతి

నాదుశతకంబు పండితామోదమంది
పాఠకమహాశయులకు సద్భక్తిఁ గలిపి
క్షితిని విశ్రుతిఁ గనునట్లు సేయుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 422

సావధానులై యీ చతుశ్శతిని నాల
కించుదానజనులఁ గటాక్షించి నీవు
కర్మబంధముల్ తొలఁగించి కావుమయ్య
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 423

శుద్ధచేతస్కులై దీని శ్రద్ధతోడ
నహరహము పఠించెడి సుకృతాత్ములకును
దివ్యకైవల్యమును బ్రసాదింపుమయ్య;
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 424

కేవలము భవన్నామసంకీర్తనంబు
సేయు పామరజనుల వాంఛితములెల్లఁ
ద్వరితగతిఁ దీర్చి వారికి శరణమగుము
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 425

భువిని ప్రజలెల్లరును మూఁడుపూవు లాఱు
కాయలుగ మహాభ్యుదయంబుఁ గాంచవలయు
నాయురారోగ్య సుఖశాంతు లందవలయు
బాలబాలాజి ! అప్పనపల్లిదేవ ! 426

మంగళము నీకు నవరత్నమయకిరీట!
మంగళము నీకు మృగమదసంగతాంగ!
మంగళము నీకు సర్వసంపత్ప్రదాత!
బాలబాలాజి! అప్పనపల్లిదేవ! 427

హరిః ఓం తత్ సత్

నామధేయము :-	చిన సీతారామయ్య
వంశనామము :-	మెండా
జననము :-	10-11-1933
అభిజనము :-	పావన గోదావరీ నదీ తీరస్థమైన ధవళేశ్వరగ్రామము
జననీ జనకులు :-	శ్రీమతి వెంకాయమ్మ, శ్రీసత్యంలు
సహధర్మచారిణి :-	శ్రీమతి రాజరత్నం
అభ్యస్త విద్య :-	ఎమ్.ఏ. (తెలుగు)
ఉద్యోగ వివరములు :-	1958 నుండి 1991 వఱకు రాజమహేంద్రవరము, తణుకు మున్నగు పట్టణములందలి ప్రభుత్వ కళాశాలలందు ఆంధ్రోపన్యాసకత్వము. 1991 నవంబరులో పదవీ విరమణము
అభిరుచులు :-	కవితావ్యాసంగము సారస్వతానుశీలనము ఆధ్యాత్మిక చింతనము.
ముద్రిత కృతులు :-	తేనెవాకఁలు (1955) శ్రీ వేంకటేశ సుప్రభాతము (ఆంధ్రపద్యతాత్పర్యసహితము 1980)

